క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోస్టాఫీస్, మయూరిమార్గ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట పోస్టాఫీస్, గీతాంజలి స్కూల్, బేగంపేట రైల్వే స్టేషన్, ఓల్డ్ కస్టమ్స్‌బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్, మయూరిమార్గ్, అల్లంతోటబావి ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీ మిర్చి 45, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 155, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 20, చామగడ్డ 28, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

వెంకటేశ్వర్లుకు శ్రమశక్తి అవార్డు



వెంకటేశ్వర్లుకు స్వీట్ తినిపిస్తున్న మంత్రి మల్లారెడ్డి

సనత్‌నగర్: తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ (టీపీఈటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుకు శ్రమశక్తి అవార్డు దక్కింది. మేడేను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రమశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.


పరామర్శ



కిషన్‌రెడ్డిని పరామర్శిస్తున్న చీర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: ఇటీవల అనారోగ్యానికి గురై ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొంది కోలుకున్న కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డిని బీజేపీ నాయకులు పరామర్శించారు.బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చీర శ్రీకాంత్ ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి మంత్రిని పరామర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తన ఆరోగ్యం గురించి ఎలాంటి ఆందోళన అవసరం లేదని తాను పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానన్నారు.

మూసీని పరిరక్షించకపోతే జనజీవనం అస్తవ్యస్తం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: మూసీ నదిని కాపాడుకోకపోతే రాబోయే రోజుల్లో నగరంలోని కోటి జనాభా ఉన్న ప్రజల అస్థిత్వం ఉండదని సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ సంస్థ ప్రజలను హెచ్చరించింది. సంస్థ ఆధ్వర్యంలో సేవ్ మూసి సేవ్ హైదరాబాద్ ఉద్యమంలో భాగంగా బుధవారం అల్పా హోటల్ నుంచి మోండా మార్కెట్, మహంకాళి దేవాలయం, ప్యాట్నీ సెంటర్ వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ధనలక్ష్మి, సుమలత, పరమేశం మాట్లాడుతూ.. మూసీనది పరివాహక ప్రాంతాల్లో పండిస్తున్న పంటలతో లక్షల మంది నగర ప్రజలు కేన్సర్‌తో పాటు అనేక రకాల రుగ్మలతో బాధపడుతున్నారని మూసి నది పరివాహక ప్రాంతంలో పండే గడ్డి తిన్న గేదెలు, ఆవుల నుంచి వచ్చే పాలతో చిన్నపిల్లలకు ఇచ్చే పాలతో కూడా కేన్సర్ లాంటి రోగాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఉండే ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రభుత్వాలను మేల్కొలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మూసీ నది మొత్తాన్ని పూర్తి ప్రక్షాళన చేస్తామని చెప్పినా ఇంత వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని వారు విమర్శించారు. ప్రభుత్వం కేవలం డబ్బు కోసం మాత్రమే చూస్తుందని కానీ దాని వెనుక లక్షల మంది అనేక ప్రాణాంతక వ్యాధులతో మరణిస్తున్నారనేది గుర్తుంచుకోవడం లేదన్నారు. ర్యాలీలో పిట్ల నగేష్, నాగుల శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాటల పునాది..
సర్దార్ పటేల్ కాలేజీ



53 వసంతాల్లోకి అడుగిడుతున్న కళాశాల
- దేశ, విదేశాల్లో స్థిరపడ్డ ఇక్కడి విద్యార్థులు
- మంత్రులు మల్లారెడ్డి, నిరంజన్ రెడ్డి పూర్వ విద్యార్థులే..

పద్మారావునగర్: తెలంగాణ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులెందరినో అక్కున చేర్చుకొని వారి విద్యా వికాసానికి కృషి, బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన సర్దార్ పటేల్(ఎస్పీ) కాలేజీ. ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. మరెందరో వివిధ రంగాల్లో అత్యున్నత హోదాల్లో స్థిర పడ్డారు. వేలాది మంది జీవితాల్లో వెలుగు నింపిన ఆ సరస్వతీ నిలయమే సర్దార్ పటేల్(ఎస్పీ) కళాశాల 53 ఏళ్లలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

గతమెంతో ఘనం..

తెలంగాణ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు విద్యను అందించడానికి 1970లో సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో సుమారు రెండెకరాల స్థలంలో సర్దార్ పటేల్ కాలేజీని స్థాపించారు. నాడు 900 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల నేడు 2000 మందితో కళకళలాడుతుంది. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో ఈ కళాశాల తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది. లాభాపేక్ష లేకుండా ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా విద్యార్థులపై ఆర్థిక భారం మోపకుండా నామమాత్రపు ఫీజులతో విద్యను అందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ రాజేందర్ రెడ్డి, కార్యదర్శి బి. సురేందర్‌రెడ్డి, కోశాధికారి సూరజ్‌సింగ్, ఉస్మానియా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపాలాచారి పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో చురుకైనపాత్ర...

ఎస్పీ కాలేజీ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల బంగారు జీవితానికి బాటలు వేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశ పెట్టి ఆ దిశగా ముందుకు సాగుతుంది. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు రాజకీయాల్లో ఉంటూ మంత్రులుగా కొనసాగుతున్నారు. విద్య, క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర అంశాల్లో విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను కనబరుస్తూ జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ కళాశాల విద్యార్థులు చురుకై న పాత్రను నిర్వహించారు. అనేక ఆందోళనలు, ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఉన్నత హోదాల్లో పూర్వ విద్యార్థులు..

తెలంగాణ మంత్రి వర్గంలో కొనసాగుతున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిలతో పాటు పోలీసు అధికారి కమలాహాసన్‌రెడ్డి, క్రికెటర్ శివలాల్ యాదవ్ ఈ కళాశాల పూర్వ విద్యార్థులే. అదే విధంగా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఐఏసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఐఆర్ఎస్ రామకృష్ణ, అదనపు కలెక్టర్ ఏనుగుల నర్సింహారెడ్డి సైతం ఈ కళాశాలలోనే విద్యనభ్యసించారు.

ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం..



మెరుగైన విద్యాబోధనతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతిలో విద్యను అందిస్తున్నాం. విద్య, క్రీడా, సాహిత్య, సాంస్కృతిక రంగాలతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల్లో ఎంతో ప్రోత్సహిస్తున్నాం. లాభాపేక్ష లేకుండా సమాజానికి ఉత్తమ పౌరులను అందించడానికి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం.

– ఎస్. హేమలత, ప్రిన్సిపల్

అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి



దీక్షలో పాల్గొన్న నాయకులు

బౌద్ధనగర్: దళితబంధులో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలపై సీఎం కేసీఆర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్శిగుట్ట చౌరస్తాలో మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ) సికింద్రాబాద్ కో–ఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. దళితబంధులో లంచాలు తీసుకొని అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లు ఇంకా బయట పెట్టకపోవడం, వారిపై చర్యలు తీసుకోకపోవడం అంటే దళితులను మోసగించడానికి కేసీఆర్ ప్రోత్సహించడమేనని విమర్శించారు. కేసీఆర్ అవలంభిస్తున్న దళిత వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమన్నారు. దళితబంధును అవినీతిబంధుగా చేసిన కేసీఆర్‌కు దళితులు గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అవినీతి ఎమ్మెల్యేలను శిక్షించే వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతూనే ఉంటామని ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్ల ముందు మహాధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, రాజేందర్, యాదగిరి, వేముల నర్సింగ్, త్రినేత్ర, సురేష్, బాబు, నరేందర్, రావుల యాదగిరి, దాసరి పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'బంగారు' బుడత



చిన్నారి సాత్విక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ మూడో వార్డు అన్నానగర్‌కు చెందిన చిన్నారి సాత్విక్ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. నాలుగో తరగతి చదువుతున్న సాత్విక్ సమీపంలోనే ఉన్న జింఖానా మైదానంలో స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. కుమారుడి ఆసక్తిని గమనించి తండ్రి శ్రీనివాస్ ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తూ ప్రోత్సాహం అందిస్తున్నాడు. ఈ క్రమంలో కోచ్ అనూప్ కుమార్ సహకారంతో సాత్విక్‌ను ఏప్రిల్ 27 నుంచి మే 2వ తేదీ వరకు జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపారు. 7 నుంచి 9 సంవత్సరాల విభాగంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సాత్విక్ మొత్తం మూడు బంగారు పతకాలు సాధించాడు.

పేదలకు 300 గజాల స్థలం కేటాయించాలి

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న కోటి మంది జనాభాలో 50 శాతం మంది పేదలు ఉన్నారని వారందరి 300 గజాల ఇంటి స్థలం కేటాయించాలని తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికార సమితి డిమాండ్ చేసింది. బుధవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సింగారం ప్రేమ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వడ్డెపల్లి జయరాజ్, ప్రధాన కార్యదర్శిగా జంగిటి శ్రీనివాస్‌ను నియమిస్తూ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో ఉండే అధిక జనాభాకు ఉండేందుకు ఇళ్లు కూడా లేకుండా పోయిందని ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్రూమ్‌లు కేవలం అధికార పార్టీకి చెందిన వారికి అందుతున్నాయని ఆరోపించారు. అందుకే తాము నగరంలో నివస్తున్న పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని అలాగే ఆటో కార్మికులకు ఎలక్ట్రిక్ ఆటోలను ఉచితంగా అందించాలని వారికి ఆటో కార్పొరేషన్‌ను రూ.10వేల కోట్లతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కబ్జాలను కట్టడి చేయాలి



అక్రమ నిర్మాణాలను చూపిస్తున్న నాయకులు

రసూల్‌పురా: ప్యాట్నీ నాలా ఇరువైపులా కబ్జాలను తొలగించి లోతట్టు ప్రాంతాలను ముంపు నుంచి నివారించే విధంగా కంటోన్మెంట్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు జి. సాంసన్ రాజు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్యాట్నీనగర్, పైగా కాలనీలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో సాంసన్ రాజు బుధవారం నాలా వెంట ఉన్న నిర్మించిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాకు ఓ పక్క ప్యాట్నీనగర్‌లో నాలాకు ఆనుకుని 60 గజాల మేర కబ్జా చేశారని అదే విధంగా నాలాకు ఇటువైపు బీహెచ్ఈఎల్ కాలనీలో ఓ గోడౌన్ యజమాని పదిహేను గజాల మేర కబ్జా చేసి నిర్మాణాలు చేశారని పైగా కాలనీలో సైతం నాలాలో ఓ భవన యజమాని అక్రమ నిర్మాణం చేశారని ఈ కబ్జాలను బోర్డు అధికారులు వెంటనే తొలగించాలని కోరారు. ఈ విషయాన్ని బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశామన్నారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు, బీఆర్ఎస్ ప్రభుత్వం, కబ్జాలను తొలగించకుండా కోట్లాది రూపాయలను వెచ్చించి కల్వర్టులు కట్టినా ఫలితం ఉండదని అన్నారు. కబ్జాలను తొలగించని పక్షంలో ముంపునకు గురవుతున్న ప్రాంతాల ప్రజలతో కలసి బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: బోర్డు సభ్యుడు రామకృష్ణ శవ రాజకీయాలు చేస్తూ నైతిక విలువలు వదిలేశాడని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, నళిని, భాగ్యశ్రీలతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న మృతి పట్ల రామకృష్ణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యంగా సాయన్న మృతికి రాజశేఖర్ రెడ్డి కారకుడు అంటూ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. సాయన్న మరణానంతరం మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేతలంతా ఏకతాటిపైకి వచ్చామన్నారు. సాయన్న శిష్యుడిగా చెప్పుకునే రామకృష్ణ ఇంతవరకూ ఆయన కుటుంబ సభ్యులను సైతం పరామర్శించలేదన్నారు. రోడ్ల మూసివేత, రామన్నకుంటకు నిధులు, ప్యాట్నీ నాలాపై బ్రిడ్జి పునర్‌నిర్మాణం, కంటోన్మెంట్‌కు ఉచిత నీటి పథకం అమలు తదితర అంశాలపై మర్రి రాజశేఖర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సాయన్నతో కలిసే రాష్ట్ర ప్రభుత్వ పెద్దల వద్దకు వెళ్లి సాధించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. మా పార్టీలో వర్గ విభేదాలు ఏమీ లేవని, బీజేపీ నేతలు విచ్ఛిన్నకర ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. లోకనాథం మాట్లాడుతూ.. ఎనిమిదో వార్డులో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో రామకృష్ణ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

సునీల్ కుమార్ బాబు



అంబేడ్కర్, జగ్జీవనరామ్ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సునీల్‌కుమార్ బాబు

లాలాపేట: పేదరిక నిర్మూలన, అసమానతలను రూపుమాపేందుకు వందేళ్ల క్రితమే అంబేడ్కర్ ఆలోచన చేశారు. దానికి అనుగుణంగానే నేటి ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వాటన్నింటిని ఉపయోగించుకుని వృద్ధిలోకి రావాలని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్(ఎన్‌సీఎస్సీ) హైదరాబాద్ డైరెక్టర్ డా. సునీల్ కుమార్ బాబు అన్నారు. తార్నాకలోని ఐసీఎంఆర్–నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లోని అసెంబ్లీ హాల్లో బుధవారం నిర్వహించిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా 80 శాతం ప్రజలు పేదరికంలోనే ఉన్నారని పేదరిక నిర్మూలన జరగాలంటే భూ సంస్కరణలు, భూ పంపిణీ, సమిష్టి వ్యవసాయం వంటివి అమలు చేయాలని ఆనాడే అంబేడ్కర్ చెప్పారన్నారు. దీంతో పాటు లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం అంబేడ్కర్ తన జీవితాంతం ఉద్యమించారని వివరించారు. విద్యద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇలా అన్ని రంగాల్లో సమానత్వం వస్తుందని వీటన్నింటిని భారత రాజ్యాంగంలో పొందుపరిచారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజనకు సైతం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత, శాస్త్రవేత్తలు డా. భానుప్రకాశ్‌రెడ్డి, సెలబ్రేషన్ కమిటీ బృందం లక్ష్మణ్, సత్యపాల్, అర్లప్ప, హరినారాయణ పాల్గొన్నారు.

బీఎల్ఆర్ ట్రస్ట్ చేయూత



చెక్కు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: కంటికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న హబ్సిగూడకు చెందిన సంతోష్ కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. సంతోష్ కుమారుడు అయోధ్యరాజు, కుమార్తెలు ఆకాంక్ష, తేజశ్రీలు కంటి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారనే విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండారి లక్ష్మారెడ్డి తన ట్రస్ట్ ద్వారా కంటి శస్త్ర చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకువచ్చారు. మంత్రి తలసాని మాట్లాడుతూ.. సొంత డబ్బులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బండారి లక్ష్మారెడ్డి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో కాంట్రాక్టు అధ్యాపకులు ర్యాలీలు చేపట్టినట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పరుశురాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ధర్మతేజ పేర్కొన్నారు. బుధవారం ఓయూ పాలన భవనం నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని భారీ ర్యాలీ చేపట్టారు. రాష్ట్రంలో ఇతర కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసి వర్సిటీల అధ్యాపకులను విస్మరించడం బాధాకరమన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను సైతం పర్మినెంట్ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కంటోన్మెంట్ విలీనం అంశంపై పోస్టుకార్డు ఉద్యమం



రసూల్‌పురాలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన వికాస్ మంచ్ ప్రతినిధులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కోరుతూ కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో రసూల్‌పురా కంగాల్ చౌరస్తా వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచ్ అధ్యక్షులు న్యాయవాది గడ్డం ఏబెల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రాంత విలీనం అంశం విషయమై ఏర్పాటైన కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కమిటీకి నివేదిక చేరి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ప్రొసిడింగ్స్ ఆర్డర్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్లాస్ వన్ కేటగిరికి చెందిన కంటోన్మెంట్ కావడంతో 50వేల పోస్టు కార్డులను ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపిస్తామని మంచ్ ప్రతినిధి ప్రభుగుప్తా చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఫజ్సీ, సాంసన్ రాజు, ఎస్‌కే. బాబు, హరిబాబు, సత్యనారాయణ, శ్రీహరి, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

సింపోజియాలకు ఓయూ ముస్తాబు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రేపటి నుంచి (5న) ప్రారంభం కానున్న జాతీయాలకు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆయా విభాగాలను ముస్తాబు చేశారు. నిధుల సమీకరణ మొదలు అన్ని కార్యక్రమాలు విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల సింపోజియాలలో ఆయా విభాగాలలో విద్యార్థులు కొత్తగా కనిపెట్టిన మోడల్స్ (అంశాలు) ప్రదర్శించనున్నారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇటీవల ప్రారంభమైన సచివాలయ భవనం నమునాన్ని ప్రదర్శన కోసం తయారు చేశారు. సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, బయోమెడికల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాలలో విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌ను ప్రదర్శించనున్నారు.

ఆధ్యాత్మికతతో అన్నీ శుభాలే



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న క్రిశాంక్, జంపన ప్రతాప్

కంటోన్మెంట్: ప్రజల్లో ఆధ్యాత్మిక ధోరణి పెరగడం వల్ల అన్నీ శుభాలే కలుగుతాయని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని ముత్యాలమ్మ దేవాలయ పునర్‌నిర్మాణ పనుల శంకుస్థాపనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయ ప్రధాన అర్చకులు వేణుమాధవ్ శర్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాల సమ ప్రాధాన్యమిస్తూ పండుగల నిర్వహణకు సైతం ప్రభుత్వం తరపున నిధులు అందజేస్తోందన్నారు. బోనాల పండుగ సందర్భంగా పలు దేవాలయాలకు నేరుగా నిధులు ఇస్తోందన్నారు. త్వరలో జరగబోయే బోనాల పండుగ మరింత వైభవంగా జరిగేలా తన వంతు సహకారం అందజేస్తానని అన్నారు. శంకుస్థాపనలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, స్థానికులు దుర్గయ్య, అజిత్, లక్ష్మణ్, కొమరయ్య, నర్సింహ, ప్రేమ్ కుమార్, మోని, సాయి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో తెరుచుకోని రోడ్లు!



రిచర్డ్‌సన్ రోడ్‌లో రహదారిపై తొలగించని ప్రహరీ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మూసేసిన రోడ్లను తెరిపించింది తామంటే తాము అని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నా ఆర్మీ అధికారులు ఇంకా రాకపోకలకు అనేక ఆంక్షలు పెడుతున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. బుధవారం బొల్లారంలో మీడియాతో మనోజ్ మాట్లాడుతూ.. లక్డావాల జంక్షన్ నుంచి లోపలికి వెళ్లేటప్పుడు రిజర్డ్‌సన్ రోడ్‌లోని ప్రహరీ ఇంకా తొలగించకపోవడంతో రహదారి అవతలికి చేరేందుకు చుట్టూ అదనంగా 500 మీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. ఇక మేజర్ మల్లయ్య నివాసానికి సమీపంలో ఉన్న రహదారిపై గేట్లకు తాళాలు ఇంకా వేసే ఉన్నాయని ఈ వైపు నుంచి లక్డావాలా చేరుకోవడానికి వందమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది కానీ.. తాళాలు తీయకపోవడంతో 500 మీటర్లు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆర్ఎస్ఐ రోడ్‌లో బారికేడ్లు అలాగే ఉన్నాయని వాటిని తొలగించలేదని దీంతో అమ్ముగూడ చేరాలంటే సుమారు నాలుగు వందల మీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది.

రాకపోకలపై ఆంక్షలు..

లక్డావాలా నుంచి అమ్ముగూడ, యాప్రాల్, దమ్మాయిగూడ, బాలాజీనగర్ ఇతర ప్రాంతాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను, ఆటోలను, అదే విధంగా కమర్షియల్ వాహనాలను ఆర్మీ అధికారులు అనుమతించడం లేదని కేవలం కార్లు, ద్విచక్ర వాహనాలను అనుమతిస్తున్నారని ప్రతి ఒక్కరి ఐడీ, ఆధార్ కార్డు చూపించాలని వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారని అన్నారు. రోడ్లను తెరిచిన విషయమై రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులకు పూర్తిస్థాయిలో నివేదికను పంపించాలని కంటోన్మెంట్ బోర్డు సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయని సీఈవో మధుకర్ నాయక్ ప్రత్యక్షంగా తనిఖీలు చేసి క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గమనించి పూర్తి స్థాయిలో నివేదిక లను పంపించాలని మనోజ్ కోరారు.



పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే గంగా పుష్కరాలను పురస్కరించుకుని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు సామల హేమ, రసూరి సునీత, కంది శైలజ, లింగాని లక్ష్మీ ప్రసన్న, బీఆర్ఎస్ నాయకుడు సుంకు రాంచందర్ తదితరులు హరిద్వార్, ఉత్తరాఖండ్‌లో గంగా హారతి తీసుకున్నారు.

–సికింద్రాబాద్

బైక్‌ల దొంగలకు రిమాండ్



వాహనాలను చూపిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

లాలాపేట: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నలుగురిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్, ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. మౌలాలీ ఆర్టీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఫిరోజ్(22), అంబర్‌పేటకు చెందిన కీర్తి శ్యామ్‌సుందర్ (23) మౌలాలి హనుమాన్‌నగర్‌కు చెందిన డి.ఆకాష్ (24)తో పాటు మరో మైనర్ చదువు ఆపేసి జులాయిగా తిరుగుతూ సులువుగా డబ్బులు సంపాదించాలనే బైక్‌లను దొంగిలించేవారు. గురువారం వేకువజామున లాలాపేట ఫ్లైఓవర్ సమీపంలో నలుగురు నంబర్ ప్లేటు లేని రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడగా మల్కాజిగిరి, కుషాయిగూడ, కీసర పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఒరిస్సాకు చెందిన మణిమోహన్ షికారిని సైతం త్వరలో పట్టుకుంటామన్నారు. మణిమోహన్ షికారితో 2017లో ద్విచక్ర వాహన చోరీ కేసులో జైలుకెళ్లిన ఫిరోజ్ పరిచయం ఏర్పడింది. ద్విచక్ర వాహనాల చోరీకి అక్కడే ప్రణాళిక వేశారు. చోరీ చేసిన వాహనాలను ఒరిస్సాలో సులభంగా అమ్మిపెడతానంటూ మణిమోహన్ షికారి నమ్మబలికాడు. దీంతో ఫిరోజ్ మరో ముగ్గురితో కలిసి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నారు.